బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు





మోడల్ మార్కెట్, ఎన్ఆర్ఎస్ క్వార్టర్స్ వద్ద రంగోలి వేసి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో వారం రోజుల పాటు పారిశుద్ధ్య సిబ్బంది చెత్తపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో భాగంగా ఐదో రోజు రంగోలి కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం హస్మత్‌పేట మోడల్ మార్కెట్ జీవీపీ పాయింట్ దగ్గర వేస్తున్న చెత్తను ఇంటింటికీ తిరిగి చెత్త సేకరిస్తున్న వారికి అందించాలని ప్రజలకు వివరిస్తూ చెత్త వేయకుండా ముగ్గులను చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్‌పీ సురేఖ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఎస్ క్వార్టర్స్, మోడల్ మార్కెట్ వద్ద ప్రజలు చెత్తను డంప్ చేస్తున్నారు.

◆ బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయొద్దని.. రోడ్లపై చెత్తను వేస్తున్న వారికి అవగాహన కలిఎంచడంతో పాటు అక్కడ ముగ్గులను వేశారు. ప్రజలకు వారం రోజుల పాటు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా వారికి అవగాహన కల్పిస్తూ చెత్త సేకరణ చేసే వాహన డ్రైవర్లను పరిచయం చేయడం వంటివి చేస్తున్నామని పేర్కొన్నారు. శనివారం వెండర్స్‌తో సమావేశం ఏర్పాటు చేసి చెత్తపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తేజ, ఉదయ్‌శ్రీ, ఎస్ఎఫ్ఏ రాజు, జవాన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ హైదరాబాద్– ప్లాక్ష యూనివర్సిటీ ఒప్పందం



ప్రొ. పీజేనారాయణన్, ప్లాక్షా వైస్‌చాన్సలర్ ప్రొ.రుద్ర ప్రతాప్ సంతకాలు చేస్తున్న దృశ్యం

- 'సుస్థిరత' కోసం 'ఉమ్మడి కేంద్రం' ఏర్పాటుకు నిర్ణయం
- ఒప్పందంపై సంతకాలు చేసిన ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: 'సుస్థిరత' కోసం 'ఉమ్మడి కేంద్రం' (సస్టేనబుల్ సెంటర్) ఏర్పాటు చేయాలని గచ్చిబౌలి ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్, ప్లాక్ష యూనివర్సిటీ సమిష్టిగా నిర్ణయించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం రెండు సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పంద పత్రాలపై ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్, ప్లాక్ష యూనివర్సిటీ వ్యవస్థాపక వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ రుద్ర ప్రతాప్ సంతకాలు చేశారు. ఈ సెంటర్ ప్రాథమికంగా గ్రామాలు, పట్టణాల చుట్టూ ఉన్న పిరమిడ్ వినియోగ కేసుల పరిశోధనపై దృష్టి పెడుతుంది. ఇది గాలి, కాలుష్యం, నీరు, నెట్‌వర్క్‌లు, డబ్ల్యూటీపీ, ఎస్‌టీపీ, వర్షం, శక్తి, స్మార్ట్ మీటర్లు, పంపిణీ, గ్రిడ్‌లు, నిల్వ, వ్యర్థాల నిర్వహణ ఘననీరు, ఇతరత్రా వాటితో పాటు ఆహారం/వ్యవసాయం వంటి ఫంక్షనల్ డొమైన్‌లలో సమస్యలను తీసుకుంటుంది.

ఉమ్మడి నిర్ణయాలు అమలు చేస్తాం

ఈ కేంద్రం ప్రభావవంతమైన పరిశోధన, విద్యా కార్యక్రమాలు, సమాజ ప్రమేయంపై పనిచేస్తుందన్నారు. మా మధ్య బంధం మరింత పెంచేందుకు ఈ ఒప్పందం ఎంతో దోహదం చేస్తుందన్నారు.ప్లాక్ష యూనివర్సిటీ వ్యవస్థాపక వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ రుద్ర ప్రతాప్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ నియామకం

- డివిజన్ల వారీగా కోర్ కమిటీలు
- బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

రాయదుర్గం: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ల వారీగా కోర్ కమిటీలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పార్టీని పటిష్టం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ కష్టపడితేనే చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం సాధిస్తారని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ బీజేపీని శేరిలింగంపల్లిలో మరింత పటిష్టం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రభారి శ్రీనివాస్, కన్వీనర్ రాఘవేంద్రరావు, కార్యవర్గ సభ్యుడు రవీందర్‌రావు, నరేష్, బీజేపీ, బీజేవైఎం, మహిళామోర్చా, ఇతర అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాల్ పన్నాలాల్ ఆదర్శప్రాయుడు

బంజారాహిల్స్: స్వతంత్ర సమరయోధుడిగా, సోషలిస్ట్ నాయకుడిగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన బద్రీ విశాల్ పన్నాలాల్ పిత్తి ఆదర్శప్రాయుడని శాసనమండలి స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. బంజారాహిల్స్‌లోని తాజ్‌దక్కన్ హోటల్‌లో బద్రీ విశాల్ 96వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై స్మారకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. బద్రీ విశాల్ చూపిన దారిలో ఆయన కుమారుడు శరత్ కూడా నడవడం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న విశ్రాంత సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి.. బద్రీ విశాల్ పేరిట తెలుగు, హిందీలో ముద్రితమైన పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ శరత్ పిత్తి, సభ్యులు లక్ష్మీనివాస్ శర్మ, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ

అధ్వానంగా రోడ్లు..





చందానగర్ డివిజన్ పరిధి ఇందిరానగర్‌లో అంతర్గత రోడ్ల పరిస్థితి

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ బస్తీలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారాయి. దీంతో అంతర్గత రోడ్ల కోసం ఎన్నికల ముందు హడావుడిగా శంకుస్థాపన చేశారు. నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీనికితోడు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కాలువ నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఇందిరానగర్ బస్తీలో సుమారు రూ.2.40 కోట్లతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, శ్మశానవాటిక, పైప్‌లైన్ నిర్మాణాలకు ఎమ్మెల్యే గాంధీ గత సంవత్సరం సెప్టెంబర్ 22న శంకుస్థాపన చేశారు. బస్తీలో రోడ్డు మధ్యలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి ఇరువైపులా రోడ్డు వేయలేదు. దీంతో రాత్రి సమయాలలో వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ బస్తీవాసులు చందానగర్ ప్రధానరోడ్డుకు వెళ్ళాలంటే చుట్టు తిరిగి వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్తీలో యూజీడీ పనులతో రోడ్లు గుంతలు పడ్డాయని స్థానికులు వాపోయారు. రోడ్లపైనే మట్టికుప్పలు, చెత్తాచెదారం దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా బస్తీలవాసులు కోరుతున్నారు.



ఇందిరానగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వద్ద అసంపూర్తిగా చాంబర్ల నిర్మాణం

శంకుస్థాపన చేసి వదిలేశారు



గత సంవత్సరం సెప్టెంబర్‌లో బస్తీలోని అంతర్గత రోడ్డు నిర్మాణం కొరకు హడావుడిగా శంకుస్థాపన చేశారు. కానీ తిరిగి ఇప్పటి వరకు నాయకులు మా బస్తీ వైపు కన్నెత్తి చూడలేదు. పలు అభివృద్ధి పనులంటూ కొబ్బరికాయలు కొట్టి వెళ్ళిపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అంతర్గత రోడ్డు పనులు ప్రారంభించే విధంగా దృష్టి సారించాలి.

– రాజేశ్వరాచారి, ఇందిరానగర్ బస్తీ

అసంపూర్తిగా మురుగు కాలువ పనులు



బస్తీలో గత ఏడాది అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కాలువ పనులు ప్రారంభించి దాదాపు పూర్తి చేశారు. కానీ రెండు చాంబర్లు నిర్మించకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇప్పటికైనా ఈ చాంబర్లు నిర్మిస్తే బాగుంటుంది.

– రవి, ఇందిరానగర్ బస్తీ

నేడు సత్యనారాయణస్వామి వ్రతం

మోతీనగర్: కబీర్‌నగర్‌లోని శివరామాంజనేయ స్వామి దేవాలయంలో ప్రతినెల సత్యనారాయణ వ్రతం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈనెల 30న ఉదయం 10గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఈ వ్రతంలో పాల్గొనాలనుకునే దంపతులు రూ.616 చెల్లించి పాల్గొనవచ్చని తెలిపారు.

నేడు శ్రీవారి కల్యాణం

మోతీనగర్: దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో పాండురంగనగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రతి శనివారం శ్రీవారి కల్యాణ మహోత్సవం ఉంటుందని ఆలయ కార్య నిర్వాహణ అధికారి జీవీకే కృష్ణ తెలిపారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30గంటల వరకు స్వామివారి కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులుకావాలన్నారు.

వారాంతపు పశువుల సంత

మోతీనగర్: మూసాపేట డివిజన్ బబ్బుగూడలో ప్రతి శని, ఆదివారం రెండు రోజుల పాటు రంగారెడ్డి జిల్లా నార్సింగ్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువుల సంత కొనసాగుతుంది. సంతలో రాష్ట్రంతో పాటు వివిధ జిల్లాల రైతులు వచ్చి అమ్మకాలు, కొనుగోలు చేపడతారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

మూసాపేట: మూసాపేట రెయిన్‌బో విస్టాస్ సమీపంలో ఓ వ్యక్తి చనిపోయిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోస్గికి చెందిన ఈడిగ రమేష్ గౌడ్(35) మూసాపేటలో నివాసం ఉంటూ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెయిన్‌బో విస్టాస్ సమీపంలో రోడ్డు పక్కన చనిపోయి ఉండటంతో వాకింగ్‌కు వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్: రాష్ట్రంలోని 145 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న 1,600 మంది గెస్ట్ లెక్చరర్లను ఆటో రెన్యువల్ చేయడంతో పాటు పీరియడ్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా.కొర్ర ఈశ్వర్ లాల్, కో–ఆర్డినేటర్ డా.బుచ్చిపాల్ రెడ్డి, కోశాధికారి పి.నరేశ్ మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తమ డిమాండ్లను పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. హామీ ప్రకారం డిగ్రీ గెస్ట్ లెక్చరర్లకు నెలకు రూ.50 వేల వేతనంతో పాటు 12 నెలలకు కన్సాలిడేట్ అమలు చేయాలని, డిగ్రీ గెస్ట్ ఫ్యాకల్టీలను కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, పీటీఎల్, ఎంటీఎస్‌లుగా కన్వర్ట్ చేయాలని కోరారు. ట్రాన్స్‌ఫర్, ప్రమోషన్‌లతో డిస్టర్బ్ అయినా గెస్ట్ ఫ్యాకల్టీలను రీ లోకేట్ చేయాలని, ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించాలని, గెస్ట్ లెక్చరర్లకు రూ.10 లక్షల ప్రమాద బీమా పాలసీ అమలు చేయాలని వారు కోరారు. సమావేశంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ హఫీజ్ ఖాజా, రాకేశ్‌రెడ్డి, ప్రభాకర్, శివుడు పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిబింబ్ థీమ్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

అల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీలోని ఎస్ఎస్‌డీ గ్రామర్ హైస్కూల్‌లో స్కూల్‌లో ఫౌండర్ రవీందర్‌రావు ఆధ్వర్యంలో 'ప్రతిబింబ్ థీమ్'వేడుకలు ఘనంగా నిర్వహించారు. తరగతుల వారీగా ఈ వేడుకలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. ప్రతి విద్యార్థిని ప్రోత్సహించి, వారికి ఇష్టమైన విషయాల్లో అవగాహన కల్పించటానికి ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇంగ్లిష్ కాన్సెప్ట్, డాన్స్ ప్రోగ్రామ్స్, స్కిట్ ప్రోగ్రామ్‌లలో ఆసక్తిగా విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు స్టేజ్ ఫియర్, బాడీ లాంగ్వేజ్, కమ్యూనికేషన్స్ స్కిల్స్, సబ్జెక్టుల నుంచి పలు అంశాలను తీసుకొని వాటికి స్పీకింగ్ డ్యాన్సును జోడించి వినూత్న ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో భాగంగా వాటర్ సైకిల్, ఫైవ్ ఎలిమెంట్, ఎలక్ట్రో మాగ్నెటిజం, జంక్ ఫుడ్స్, సేవ్ సాయిల్, సేవ్ గంగా, మ్యాథ్స్ మ్యాజిక్, ట్రాఫిక్ సిగ్నల్, ఫండమెంటల్ రైట్స్, వివిధ రకాల వృత్తులు, సోలార్ సిస్టమ్, పార్ట్స్ ఆఫ్ స్పీచ్, సేవ్ బర్డ్స్ వంటి వాటి గురించి విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ వేడుకకు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సురభి దుర్గావాణి, ప్రిన్సిపాల్ సురభి తేజస్విని, ఇన్‌చార్జీలు, ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 15, వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జిమిర్చి 45, కాకరకాయ 35, బీరకాయ 45, క్యాబేజి 21, బీన్స్ 50, క్యారెట్ 23, గోబిపువ్వు 18, దొండకాయ 19, చిక్కుడుకాయ 55, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 23, క్యాప్సికం 70, ఆలుగడ్డ 27, కీరా 23, దోసకాయ 16, సొరకాయ 9, పొట్లకాయ 18, కంద 65, ఉల్లిపొరక 40, ఉల్లిగడ్డ 22, మామిడికాయ 10 నుంచి 15, అరటికాయ 8 నుంచి 9, చామగడ్డ 35, ముల్లంగి 4 నుంచి 6, చిలగడ దుంప 21, గుమ్మడికాయ 40, నిమ్మకాయలు 55 నుంచి 60, మునగకాయలు 5 నుంచి 6, పచ్చిబఠాణి 55, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 200, అల్లం 180, వెల్లుల్లి 180, చింతపండు 140, పండుమిర్చి 80, ఉసిరి 40, వేరుశెనగ నూనె 165, పామాయిల్ నూనె 97లుగా ఉన్నాయి.

రేపు ఆప్ పార్టీ 'ఛలో ఢిల్లీ'

లిబర్టీ: ప్రతిపక్షాలను అణిచివేస్తూ ప్రధాని మోదీ నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. ఇందుకు నిదర్శనమే ఇటీవల ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు అన్నారు. కేజ్రీవాల్ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్‌చేస్తూ ఈ నెల 31న ఆమ్ ఆద్మీ పార్టీ ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనుందని ఆయన తెలిపారు. లిబర్టీ ఆప్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాముగౌడ్, మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి హేమ జిల్లోజు, నర్సింగ్ యమునగౌడ్, అధికార ప్రతినిధి జావేద్ షరీఫ్, దివ్యంగా విభాగం కన్వీనర్ దర్శనం రమేశ్, నేతలు కొడంగల్ శ్రీనివాస్, మౌనికలతో కలిసి డాక్టర్ దిడ్డి సుధాకర్ వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. ఈడీ బూటకపు కేసులతో ఆప్ నేతలు భయపడరని, ఈ నెల 31న ఢిల్లీలో బీజేపీ పైశాచిక చెర్యలను అడ్డుకునేలా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

'మాదిగలది అబద్ధపు ప్రచారం'

బంజారాహిల్స్: రాజకీయాల్లో కష్టపడిన మాలలకు సీట్లు ఇస్తే మాదిగలు ఓర్వలేకపోతున్నారని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ విమర్శించారు. రాష్ట్రంలో 80 లక్షల మంది మాదిగలు ఉంటే, మాలలు కూడా సమాన స్థాయిలో ఉన్నారన్నారు. ఈ విషయాన్ని పిడమర్తి రవి గుర్తించుకోవాలని హితవుపలికారు. మాలలపై మాదిగలు చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని తక్షణమే మానుకోవాలని, లేదంటే భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇటీవల బీఆర్ఎస్‌లో ఉన్న పిడమర్తి రవి, గజ్జల కాంతం ఇప్పుడు కంటోన్మెంట్, పెద్దపల్లి సీట్లు అడిగే నైతికత లేదని పేర్కొన్నారు.

ప్రొ.మధుజ్యోతికి తెలుగు వర్సిటీ పురస్కారం

ఉస్మానియా యూనివర్సిటీ: ద్రావిడ విశ్వవిద్యాలయం వీసీ ప్రొ.కొలకలూరి మధుజ్యోతి పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ ఉత్తమ రచయిత్రి ప్రతిభా పురస్కారం అందుకున్నారు. తెలుగు భాష సాహిత్య రచనలు చేసిన సేవలను గుర్తించిన తెలుగు వర్సిటీ 2022 ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో వీసీ ప్రొ.మధుజ్యోతికి ఉత్తమ రచయిత్రి పురస్కారంతో పాటు రూ. 20,166 నగదును ముఖ్య అతిథిగా హాజరైన సినీ దర్శకులు బి.నర్సింగరావు, వీసీ ప్రొ.తంగెడ కిషన్‌రావు అందజేశారు. తెలుగు ప్రొఫెసర్‌గా జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని 300లకు పైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. వివిధ పత్రికల్లో 101 వ్యాసాలు రాసిన ఆమె వద్ద 13 మంది విద్యార్థులు పీహెచ్‌డీ 5 మంది ఎంఫిల్ పట్టాలు అందుకున్నట్లు వివరించారు.

జింఖానా మైదానంలో ఎగ్జిబిషన్ ప్రారంభం

రసూల్‌పురా: దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన హస్త కళాకారులు, చేతి వృత్తులు రూపొందించిన కళాఖండాలు జంటనగరాల ప్రజలకు అందుబాటులో ఉన్నాయని కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం జింఖానా మైదానంలో గాంధీ స్మృతి, దర్శన్ సమితి ఆధ్వర్యంలో పునర్ మహోత్సవ్ ఎగ్జిబిషన్ ప్రదర్శనను సీఈవో మధుకర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి చైర్మన్‌గా ఉన్న గాంధీ స్మృతి సంస్థ ద్వారా కళాకారులకు ప్రోత్సాహం అందించేందుకు దేశ వ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నారని అందులో భాగంగా మన హైదరాబాద్ నగరంలో పదిహేను రోజుల పాటు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ప్రదర్శనలో వివిధ కళాకృతులు, జనపనార, తోలు వస్తువులు, లక్క గాజులు, వస్త్రాలు నగర వాసులకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సంగీత సాంస్కృతి కార్యక్రమాలు రుచికరమైన వివిధ రాష్ట్రాలకు చెందిన వంటకాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు వెల్లడించారు.

టెట్ పరీక్ష ఫీజు తగ్గింపుపై ప్రభుత్వం ప్రకటన చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: టెట్ అర్హత పరీక్ష ఫీజు తగ్గింపు పై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని బీసీ విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. టెట్ పరీక్ష ఫీజు తగ్గింపు కోసం అభ్యర్థులు ఆందోళన చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అయితే.. టీఎస్ విద్యుత్‌శాఖ జెన్‌కో కెమిస్ట్రీ పోస్టులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 60 శాతం ఉన్న మార్కుల నిబంధనను సడలించాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, సురేష్‌గౌడ్, నవీన్, బద్రీ, జాల లాలు, రాజశేఖర్, మహేష్, పవన్ పాల్గొన్నారు.

సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలి

కూకట్‌పల్లి కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి

కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి లోక్‌సభ ప్రాంతాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుండెల్లో పెట్టుకొని చూసుకుంటారని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం కూకట్‌పల్లిలోని ఎస్‌కేఎస్ఆర్ గార్డెన్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డిని ఆయన నాయకులు, కార్యకర్తలకు పరిచయం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించడానికి సమన్వయంతో పనిచేయాలని కోరారు.

◆ ఈ సందర్భంగా కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి బండి రమేష్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి కొడంగల్ ఎలాగో మల్కాజ్‌గిరి ప్రాంతం కూడా అలాంటిదన్నారు. స్థానికులైన సునీత మహేందర్‌రెడ్డిని ఇక్కడి నుంచి గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే నియోజకవర్గానికి అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం అత్యధిక నిధులు తెచ్చుకునే వెసులు బాటు ఉంటుందన్నారు. 20 ఏళ్లుగా ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఉండి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. సునీత మహేందర్‌రెడ్డి దంపతులకు ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉందన్నారు.

◆ ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సత్యం శ్రీరంగం, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, తూము వేణు, నాగిరెడ్డి, శేరి సతీష్‌రెడ్డి, కొప్పిశెట్టి దినేష్‌కుమార్, పుష్పరెడ్డి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భారతదేశంలో యువశక్తికి కొదువ లేదు

- ఐఎల్ఓ డీసెంట్ వర్క్ టీమ్ సౌత్ ఏషియా, ఇండియా డిప్యూటీ డైరెక్టర్ సంతోషి
- 64 ఇండియన్ సొసైటీ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్ (ఐఎస్ఎల్ఈ) సదస్సు ప్రారంభం

రాయదుర్గం: భారతదేశంలో యువ శక్తికి కొదవలేదని ఐఎల్ఓ డీసెంట్ వర్క్ టీమ్ సౌత్ ఏషియా, ఇండియా డిప్యూటీ డైరెక్టర్ సంతోషి ససాకి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 64 ఇండియన్ సొసైటీ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్ (ఐఎస్ఎల్ఈ) సదస్సు ప్రారంభ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువశక్తిని వినియోగించుకోవడానికి వారికి చదువుతోపాటు తగిన నైపుణ్యం కలిగి ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు.మహిళా శక్తికి కూడా భారత్‌లో కొదువ లేదని, వారికి తగిన రక్షణ ఏర్పాట్లు చేస్తే వారి పనితీరు ఎంతో మెరుగ్గా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఆర్‌బీఐ డీఈపీఆర్ ప్రిన్సిపల్ అడ్వైజర్ డాక్టర్ దేబాప్రసాద్‌రత్, హెచ్‌సీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు, ఐఎస్ఎల్ఈ అధ్యక్షుడు ప్రొఫెసర్ దీపక్ నయ్యర్, ఐబీటీ హైదరాబాద్ ప్రొఫెసర్ బద్రినారాయణ రథ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు ప్రొఫెసర్ అలోక్‌ఎస్ శర్మ, ప్రొఫెసర్ అలోక్‌కుమార్ మిశ్రా, సదస్సు అధ్యక్షులు రితుదీవాన్‌లు భారత దేశ ఆర్థిక విధానం, సెల్ఫ్‌ఎంప్లాయిమెంట్, కొవిడ్ తర్వాత ఆర్థిక పరిస్థితి, కార్మిక విధానాలు వంటి అంశాలపై ప్రసంగించారు.అనంతరం 64వ ఐఎస్ఎల్ఈ సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు.



హెచ్‌సీయూలో 64వ ఐఎస్ఎల్ఈ సదస్సులో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు